# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 218

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy    సంపాదకులు : కె.భాస్కర్‌రావు    రూ.2.00/- పేజీలు 8    తేది: గురువారం 10 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** దేశంలో రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వేలో అత్యంత రద్దీగా ఉండే ఏడు హైడెన్సిటీ కారిడార్లను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సుమారు రూ.11 వేల కోట్ల విలువైన మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ (CCEA) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం తాజా నిర్ణయంతో ఢిల్లీ–హౌరా, హౌరా–ముంబై, ఢిల్లీ–ముంబై, ఢిల్లీ–గువాహటి, ఢిల్లీ–చెన్నై, హౌరా–చెన్నై, ముంబై–చెన్నై మార్గాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లకు పెంచనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశంలోని అనేక ప్రధాన నగరాలకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు లబ్ధి చేకూరనుంది. దాదాపు 4,790 గ్రామాలకు రైలు కనెక్టివిటీ, రవాణా సామర్థ్యం పెరగనుంది. అలాగే సుమారు 56 లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలగనుంది. కాగా, ఢిల్లీ–హౌరా మార్గంలో కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, పాట్నా, ఆసన్‌సోల్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. ఢిల్లీ–ముంబై మార్గం మథుర, కోటా, రత్లాం, వడోదర, సూరత్‌లను కలుపుతుంది. ఢిల్లీ–చెన్నై మార్గంలో ఆగ్రా, గ్వాలియర్, ఝాన్సీ, భోపాల్, నాగ్‌పూర్, విజయవాడ వంటి నగరాలు ఉన్నాయి. అలాగే ముంబై–చెన్నై మార్గం పుణె సహా పలు ముఖ్యమైన ప్రాంతాలను కలుపుతుంది.




**సమయం ప్రతినిధి:** జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం?' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది.సుప్రీంకోర్టు తన అసాధారణ అధికారాలను ఉపయోగిస్తూ జులైలో జరిగిన సీజేపీ ఆందోళనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన అన్ని కేసులనూ కొట్టివేయాలని ఈ నెల 1న ఆదేశాలు జారీ చేసింది. జులై 20 నుంచి 25 మధ్య దేశ వ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఇకపై కొనసాగించరాదని, వాటిని అన్నిరకాలుగా క్లోజ్ చేస్తున్నట్టుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా.. ఆ ఆందోళనలకు సంబంధించి భవిష్యత్తులో ఏ విద్యార్థిపైనా కొత్తగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని పేర్కొంది.ఈ నేపథ్యంలో గ్రేటర్ నొయిడాకు చెందిన ఓ విద్యార్థి విషయంలో మేజిస్ట్రేట్ నోటీసు జారీచేసిన విషయాన్ని బిశ్వజిత్ భట్టాచార్య అనే సీనియర్ న్యాయవాది సుప్రీం న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.




**సమయం ప్రతినిధి:** అక్రమ నిర్మాణాలపై ఢిల్లీ ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా స్పందిస్తోంది. సిటీలోని అక్రమ నిర్మాణాలపై బుల్‌డోజర్లను ఉపయోగించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా మున్సిపల్ అధికారులకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. బుల్‌డోజర్ యాక్షన్ జరుగుతున్న సమయంలో సీనియర్ మున్సిపల్ అధికారులు సంఘటనా స్థలంలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఢిల్లీ వ్యాప్తంగా ఉన్న అన్ని పీజీ హాస్టల్స్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు ఎప్పుడు ఎవరి హయాంలో జరిగాయో తెలుసుకోవడానికి బిల్డింగ్స్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**సత్యనికేతన్ ఘటన నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు..** దక్షిణ ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఐదు అంతస్థుల పెయింగ్ గెస్ట్ హాస్టల్ భవనం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమందికి తీవ్రగాయాలు అయ్యాయి. 50 ఏళ్లనాటి భవనానికి బేస్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులు చేపట్టడంతో అది పేకమేడలాగా కుప్పకూలింది. ఈ ఘటనపై సీఎం రేఖా గుప్తా సీరియస్‌గా స్పందిస్తూ.. మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ సహా ఐదుగురు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ అధికారులు సస్పెండ్ అయ్యారు.




**సమయం ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో రేపు (గురువారం) 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరుగనుంది. జిల్లా కలెక్టర్లతో రెండు రోజుల పాటు ఈ సమావేశం నిర్వహించనున్నారు. రేపు (గురువారం), ఎల్లుండి (శుక్రవారం) రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేస్తారు. జీఎస్డీపీ, సూపర్ సిక్స్, తాగునీరు, గృహనిర్మాణం, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్‌పై మొదటిరోజు ముఖ్యమంత్రి చర్చించనున్నారు. రెండోరోజు ఈ– గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర నిధుల వినియోగంతో పాటు పలు అంశాలపై సీఎం సమీక్షించనున్నారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై కలెక్టర్లకు సీఎం మార్గనిర్దేశం చేస్తారు.

**రెండు రోజులు.. 19 అంశాలపై సమీక్ష..** మొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సీఎం చంద్రబాబు సమీక్షిస్తారు. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యారంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. రెండో రోజు సదస్సులో ఈ– గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీగా ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్ధేశం చేయనున్నారు.

# కోయకుండానే కంటతడి పెట్టిస్తున్న ఉల్లి...



● కిలో రూ. 60 నుంచి 80 వరకు ● మహారాష్ట్ర వర్షాలకు దెబ్బతిన్న పంట
● రాయలసీమలో వర్షాలు లేక పండని పంట

**సమయం ప్రతినిధి :** ఆకాశాన్నంటిన ఉల్లిగడ్డ ధరలు సామాన్యుడికి గుండెకోత మిగులుస్తున్నాయి. మొన్నటివరకు కిలో ముప్పై, నలభై రూపాయల మధ్య ఉన్న ఉల్లిగడ్డ, ఇప్పుడు ఏకంగా రూ.60 నుంచి 80 వరకు పలుకుతూ సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరింది. కూరలో ఉల్లిగడ్డ వేయాలన్నా గృహిణులు భయపడే పరిస్థితి దాపురించింది. రాష్ట్రంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు ప్రధానంగా మహారాష్ట్రలోని మన్మాడ్, లాసర్‌గఢ్, నాగపూర్ ప్రాంతాల నుంచి, మధ్యప్రదేశ్ ఇండోర్ నుంచి, ఆంధ్రప్రదేశ్ లోని కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి ఉల్లి సరఫరా అవుతుంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఎకరాల కొద్దీ ఉల్లి పంట నీట మునిగి కుళ్లిపోయింది. అలాగే ఎల్‌నినో ప్రభావంతో కర్నూల్, అనంతపురం జిల్లాల్లో వర్షాలు లేకపోవడంతో పంట సాగు కాలేదు. భారీ వర్షాలు, వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడులు పడిపోవడంతో ఇక్కడ ధరల మంటకు ప్రధాన కారణమైంది. ఒకవైపు కొరత ఉంటే, మరోవైపు కొందరు వ్యాపారుల అక్రమ సంపాదన దాహం ప్రజలను మరింత లూటీ చేస్తోంది. మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు హోల్‌సేల్ వ్యాపారులు సరుకును బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. కావాలనే శీతల గిడ్డంగుల్లో ఉల్లిని నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని సమాచారం. అధికారులు స్పందించి వేలం కేంద్రాలు, గోదాములపై దాడులు నిర్వహించి, రైతుబజార్లలో తక్కువ ధరకే ఉల్లిని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# మహబూబ్‌నగర్‌లో పర్యాటక అభివృద్ధికి చర్యలు




**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధి :** జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. కోయిల్‌కొండ మండలంలోని రాంకొండను ఉత్తమ పర్యాటక గ్రామంగా, చిత్రీకరణలకు అనువైన ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. జడ్చర్లలో వారసత్వ, పర్యాటక ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య విధానంలో ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. బుధవారం పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. పర్యాటక ప్రాంతాల్లో సౌకర్యాల కల్పన, ఐదు నక్షత్రాల హోటళ్ల నిర్మాణం, సామాజిక బాధ్యత నిధుల సమీకరణ, జిల్లాల్లో పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ నెల 26న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు పర్యాటక ప్రదేశాల సందర్శనతో పాటు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో జ్ఞాన్ భారత్ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను, పర్యాటక శాఖ నోడల్ అధికారిగా క్రిస్టినాను నియమించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పర్యాటక అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధి :** తెలంగాణలో పరిస్థితులను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వివరించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఈరోజు(బుధవారం) గవర్నర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు, కేసీఆర్ ఇంటి వద్ద కాంగ్రెస్ చావు డబ్బు, తదితర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీకి వెళ్తుంటే నడిరోడ్డుపై అడ్డుకున్నారని మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దాడి వీడియోలను గవర్నర్‌కు చూపించామన్నారు. ఎమ్మెల్యే సునీత చీరను లాగి దుశ్శాసనపర్వం ఎలా సృష్టించారో చెప్పామని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీ తరహాలోనే బ్లాక్ టీషర్ట్ వేసుకున్నామని చెప్పారు. స్పీకర్ అంటే తమకు గౌరవం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలకే కాదు.. ప్రజాప్రతినిధులకూ అవమానాలే అని అన్నారు. ముఖ్యమంత్రి ప్రేరేపించడం వల్లే మాజీ సీఎం కేసీఆర్ ఇంటి వద్దకు కాంగ్రెస్ శ్రేణులు వేల సంఖ్యలో మోహరించి చావు డబ్బు కొట్టారని గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. అసెంబ్లీ లోపల జరిగిన విషయాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేనని, బయట జరిగిన అన్ని విషయాలపై విచారణ జరిపిస్తామని గవర్నర్ తమకు హామీ ఇచ్చినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# సంపాదకీయం

## బ్రిక్స్‌లో 'విశ్వగురు' ఏమి సాధిస్తుంది?

'నేనూ అమెరికాలో దక్షిణాదికి చెందినవాడినే, మీరూ ఇండియాలో దక్షిణాదికి చెందినవారే' అని 1994లో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ అప్పటి భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. దేశంలో ఉధృత ఆర్థిక సంస్కరణలను ప్రారంభించి అమెరికన్ కార్పొరేట్ శక్తుల దృష్టి భారత్ పైకి మళ్లించేలా చేసిన తర్వాత జరిగిన సంభాషణ ఇది. ఆ తర్వాత నరసింహారావు స్వయంగా అమెరికా వెళ్లి క్లింటన్‌తో విస్తృత చర్చలు జరిపారు. భారత్‌ను అమెరికా దేనిగురించైనా ఒత్తిడి చేసిందా అన్న అర్థంలో విలేఖరులు whether your arm was twisted అని పీవీని అడిగారు. అప్పుడు ఆయన తన చేయిని చూపించి 'చెక్కుచెదరకుండా ఉన్నది. మీ అధ్యక్షుడు కనీసం తాకను కూడా లేదు..' అని జవాబిచ్చారు. 'మీరు ఆ మాట అన్నందుకు మీకు ఎంతో కృతజ్ఞుడిని ప్రధాని గారూ' అని క్లింటన్ వెంటనే వ్యాఖ్యానించారు. భారత్–అమెరికా మైత్రిలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించిన పీవీ, ఆ అగ్రరాజ్యంతో సంబంధాలను పెట్టుబడులు, టెక్నాలజీకే పరిమితం చేస్తూనే రష్యా, చైనా, ఇరాన్, అరబ్ దేశాలతో సంబంధాలను పటిష్ఠం చేశారు. వ్యూహాత్మక స్వతంత్రత, బహుళ దిశలతో కూడిన దౌత్యనీతిని అవలంబించిన పీవీ భారత క్షిపణి కార్యక్రమానికి, అణ్వస్త్ర పరీక్షలకు రంగం సిద్ధం చేస్తూనే వచ్చారు. ఆయన తర్వాత ప్రధానమంత్రి అయిన వాజపేయి... అమెరికా ఆంక్షలకు వెరవకుండా అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించారు. చివరకు అమెరికాయే భారత్‌కు మళ్లీ స్నేహహస్తం చాచే పరిస్థితులు కల్పించారు. క్లింటన్ భారత్‌లో పర్యటించారు. అమెరికా అధ్యక్షుడు ఒకరు 22 సంవత్సరాల తర్వాత భారత్‌లో పర్యటించడం అదే మొదటిసారి. ఈ పరిణామాలు ఏమి నిరూపించాయి? ప్రపంచ రాజకీయాల్లో భారత్‌ను ఎవరూ శాసించలేరని, ఎవరైనా శాసించే పరిస్థితులు వస్తే భారత్ తన మార్గం తాను అవలంబిస్తుందని స్పష్టం చేస్తున్నాయి. 'భారతదేశానికి సహజసిద్ధంగా అంతర్జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించగలిగే శక్తి ఉన్నది. ఇండియా చరిత్ర, నాగరికత, భౌగోళిక పరిస్థితులే అందుకు కారణం' అని మన తొలి ప్రధాని పండిట్ నెహ్రూ 1949లోనే ప్రకటించారు. అయితే ఇవాళ అంతర్జాతీయ దౌత్యంలో ఒక పరిణామాత్మక సంక్షోభాన్ని మనం ఎదుర్కొంటున్నాం. అమెరికా, సోవియట్ ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కూడా భారతదేశం అలీనోద్యమాన్ని ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా వ్యవస్థీకృతం చేసింది. ఆ తర్వాత అనేక కీలక అంతర్జాతీయ వ్యవస్థల రూపకల్పనలో ప్రముఖ స్థానం పోషించింది. 2009లో ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా దేశాలతో బ్రిక్స్ ఆవిర్భావంలోనూ భారత్ కీలకపాత్ర పోషించడం ఆ సముజ్వల చరిత్ర కొనసాగింపే అనడం సత్యదూరం కాదు. 'మనం ఎన్నో రకాల సవాళ్లు ఎదుర్కొంటున్నాం. ఈ పరిస్థితుల్లో కలిసికట్టుగా కార్యాచరణ చేపట్టాల్సిన అర్థవంతమైన అవకాశం మనకు లభించింది' అని మన్మోహన్‌సింగ్ 2013లో దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రకటించినప్పుడు వినే అవకాశం నాకు లభించింది. అదే ఏడాది బీజింగ్ పొలిమేరల్లో చైనా ప్రభుత్వం తమ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ పార్టీ స్కూలు సభ్యులకు మన్మోహన్ సింగ్ ద్వారా పాఠాలు చెప్పించిన అపురూప కార్యక్రమంలో కూడా నేను పాల్గొన్నాను. చైనా భావి నాయకులను తయారు చేసే ఆ పాఠశాలలో ఒక విదేశీ ప్రభుత్వాధినేతతో పాఠాలు చెప్పించడం ఒక అరుదైన ఘట్టం. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ షరతుల నేపథ్యంలో బ్రిక్స్ ఆధ్వర్యంలో 2012లో జరిగిన సదస్సులో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కూడా మన్మోహన్ సింగ్‌దే. ఏ షరతులూ లేకుండా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారత్‌లో మెట్రో, ఆర్ఆర్‌టీఎస్, గ్రామీణనీటి పారిశుధ్యం వంటి అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీ ఎత్తున నిధులు లభిస్తూనే ఉన్నాయి. న్యూఢిల్లీలో సెప్టెంబర్ 11 నుంచి 14 తేదీల మధ్య జరుగుతున్న బ్రిక్స్ సమావేశాలు ఈ నేపథ్యంలోనే మనం అర్థం చేసుకోవల్సి ఉన్నది. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత పీవీ, మన్మోహన్‌సింగ్ హయాంలో నెలకొల్పిన బహుళ సంబంధాల దిశకు భిన్నంగా అమెరికాను అధికంగా ఆలింగనం చేసుకున్నారనే విమర్శలు వచ్చినప్పటికీ ఇవాళ భారత్ తన అడుగులను సరిదిద్దుకోవాల్సిన అవసరాన్ని గ్రహించినట్లు కనపడుతోంది. బ్రిక్స్ ఇప్పుడు ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఈజిప్టుతో సహా 11 దేశాలకు విస్తరించింది. మరో 10 దేశాలను భాగస్వామ్య దేశాలుగా చేర్చుకున్నారు. ప్రపంచంలో 50శాతానికి పైగా జనాభాకు ఈ కూటమి ప్రాతినిధ్యం వహిస్తోంది. గ్లోబల్ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా ఇంచుమించు 40శాతంగా ఉన్నది. ఇరాన్‌పై దాడి, అన్ని దేశాలపై ఎడాపెడా టారిఫ్‌లు, అమెరికా ఫస్ట్ పేరుతో విపరీత విధానాల ద్వారా ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల ఆర్థిక ప్రయోజనాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లకల్లోలం చేస్తున్న పరిస్థితుల్లో బ్రిక్స్ ఒక బలమైన వ్యవస్థగా ప్రభవిస్తుందనడంలో సందేహం లేదు. ఇవాళ అమెరికా ధోరణిని పొరుగు కెనడాతో పాటు సుదూర ఉత్తర కొరియా వంటి దేశాలు కూడా ప్రతిఘటిస్తున్నాయి. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమావేశాలకు భూమికగానే గత నెలాఖరులో కిర్గిస్థాన్‌లో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సు జరిగింది. నిజానికి 2023లో ఢిల్లీలో ఎస్‌సీఓ సదస్సు జరగాల్సి ఉండగా, అమెరికాతో ఘర్షణ పడే పరిస్థితుల్లో భారత్ లేకపోవడంతో వ్యూహాత్మకంగా ఆన్‌లైన్ సమావేశం జరపాల్సి వచ్చింది. అయితే తాజా సమావేశంలో ఇరాన్ భూభాగంపై జరిగిన సైనిక దాడులను ఖండిస్తూ, పశ్చిమాసియా స్థిరత్వాన్ని సమర్థిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయడంలో భారత్ చొరవ చూపడం అత్యంత కీలక పరిణామమని చెప్పక తప్పదు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకూ సమాన ప్రాతినిధ్యం ఉండాలని, అభివృద్ధి చెందిన దేశాలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, ఆర్థిక స్వావలంబనతో పాటు బహుళ ధ్రువ వ్యవస్థ ఏర్పడాలని భారత్ ప్రతిపాదించడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ న్యూఢిల్లీ సదస్సులో రష్యా, చైనాలతో పాటు ఇతర దేశాలను భారత్ ఎంత మేరకు ప్రభావితం చేయగలదో చూడాల్సి ఉన్నది. వెస్ట్‌కు వ్యతిరేకం కాకుండా అదే సమయంలో వెస్ట్ మాత్రమే ప్రపంచ దేశాలను శాసించకుండా ఉండాలనే తన వైఖరిపై చైనా, రష్యాలను బ్రిక్స్ సమావేశంలో భారత్ ఒప్పించడమంటే కత్తిమీద సాము చేయడం వంటిది. అమెరికా డాలర్‌కు పోటీగా బ్రిక్స్ కరెన్సీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కూడా భారత్ అంగీకరించే పరిస్థితుల్లో లేదు. ఇప్పటికే స్థానిక కరెన్సీల ద్వారా బ్రిక్స్ దేశాల్లో వాణిజ్యం జరుగుతున్న రీత్యా యూపీఐ వంటి వ్యవస్థల అనుసంధానం ద్వారా దేశాల మధ్య వేగవంతమైన డిజిటల్ చెల్లింపులను ప్రవేశపెట్టాలని భారత్ ప్రతిపాదిస్తోంది. డాలర్ పెత్తనాన్ని బలంగా ఎదుర్కోగలిగిన పరిస్థితులూ, అవసరమూ లేదని మనదేశం భావిస్తోంది. భారత్ యథా ప్రకారం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోను, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లోనూ సంస్కరణలను కోరుతోంది. వీటిపై ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉన్నది. అన్నిటికన్నా భారత్‌కు ముఖ్యమైనది చైనా ఆధిపత్యాన్ని సమతుల్యం చేయడం. బ్రిక్స్ పూర్తిగా చైనా ప్రభావంలోకి వెళ్లకుండా భారత్ వీలైనంత మేరకు ప్రయత్నాలు చేస్తుందనడంలో సందేహంలేదు. అంతేకాక బ్రిక్స్ వేదికపై చైనాతో ఏర్పడే సంబంధాల ద్వారా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను నివారించి, ప్రశాంత పరిస్థితులను కల్పించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే చైనా సైనిక అధికారులతో భారత సైనికాధికారులు సరిహద్దుల్లో చర్చలు జరపడం ఇందుకు నిదర్శనం. బ్రిక్స్‌లో ఇరాన్, యూఏఈ వంటి దేశాల భాగస్వామ్యం మూలంగా భారత్‌కు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. చమురు, ఇంధన భద్రత, సముద్ర వాణిజ్య మార్గాలు, గల్ఫ్ దేశాలతో ఆర్థిక సంబంధాలు పటిష్ఠం చేసుకునే అవకాశం లభిస్తుంది. అంతేగాక బ్రిక్స్ మూలంగా లిథియం, రేర్ ఎర్త్, నికెల్ వంటి కీలక ఖనిజ వనరులపై పరస్పర సహకారం లభించే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, సౌర, పునరుత్పాదక ఇంధన వ్యవస్థల నిర్మాణానికి దోహదం కలుగుతుంది. సమావేశాలకు కొద్ది రోజుల ముందు 7.8శాతం అభివృద్ధి రేటు గురించి స్వయంగా ప్రకటించిన నరేంద్రమోదీ అభివృద్ధి చెందిన దేశాల్లో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోవాలనుకుంటున్న విషయం స్పష్టమవుతోంది. ఇటీవల దేశాన్ని కుదిపివేసిన విద్యార్థుల ఆందోళనలు, ద్రవ్యోల్బణం, ఉపాధి వంటి సమస్యలు, ఇతరేతర రాజకీయ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తున్న నరేంద్రమోదీకి బ్రిక్స్ వంటి ప్రపంచ స్థాయి సదస్సును విజయవంతంగా నిర్వహించడం అత్యంత ఆవశ్యకం.




బీఆర్ఎస్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (Telangana CM Revanth Reddy) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని ఆరోపించారు. సభను అడ్డుకోవాలని బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. మూడు రోజుల ఘటనలకు ఫాంహౌస్ సాక్షిగా కుట్ర జరిగిందని ఆరో పించారు. అసెంబ్లీ ఘటనలపై విచారణకు ఆదేశించామని అన్నారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం.. విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని.. చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిని.. కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్‌ను నియమించామని వెల్లడించారు. ఈనెల 6వ తేదీన ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని ఆరోపించారు. 7వ తేదీన స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని అన్నారు. 8వ తేదీన శుద్ధి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు.. కుట్ర చేసిన అందరిపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోర్టు బెయిల్ ఇవ్వొచ్చేమో గానీ.. సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని చెప్పారు. అసెంబ్లీ ఘటనలపై విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు.

**కేసీఆర్ కుట్ర పన్నారు..**

ప్రజా సమస్యలపై చర్చ కోసమే తాము అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 22ఏ భూములు సహా అన్ని అంశాలను చర్చించాలనుకున్నామని పేర్కొన్నారు. ఈ అంశాలపై చర్చ జరిగితే వారికి రాజకీయ సమాధి తప్పదని అసెంబ్లీ సమావేశాలపై కుట్ర చేశారని ఆగ్రహించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందురోజు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎర్రవల్లి ఫాంహౌస్‌కు పిలిపించుకుని కుట్ర పన్నారని ఆగ్రహించారు. అసెంబ్లీ సమావేశాలు జరగకుండా కేసీఆర్ కుట్ర పన్నారని ఆరోపించారు.

**ఉత్తరాఖండ్ ఘటనే.. తెలంగాణలో జరిగింది..** 'ఉత్తరాఖండ్‌లో గతంలో జరిగిన ఘటనను ఖండిస్తూ రాష్ట్రపతికి మేము ఫిర్యాదు చేశాం. దురదృష్టవశాత్తు అలాంటి ఘటనే మన తెలంగాణలో జరిగింది. కొంతమంది వచ్చి మన అసెంబ్లీ ఎదుట.. బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడి చేశారు. స్పీకర్‌తోపాటు వారి తల్లిని అవమానించారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను సమాజమంతా ఖండించింది. ఏ ఫాంహౌస్‌లో కుట్రలు చేశారో.. అక్కడే నిరసన తెలపాలని దళితులు నిర్ణయించుకున్నారు. ఫామ్‌హౌస్‌లో పన్నిన కుట్రలకు వ్యతిరేకంగానే.. అక్కడ నిరసన తెలపడానికి వారు వెళ్లారు.. దాడుల కోసం కాదు. ప్రజాస్వామిక పద్ధతిలో డప్పు కొట్టి దండోరా వేయడం ద్వారా.. తమ మనసులోని భావాలను దళితులు వ్యక్తీకరించారు' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే పోషకాహార లోపానికి అడ్డుకట్ట

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9: జిల్లాలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రజల భాగస్వామ్యంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్–2026 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహించే పోషణ్ మాహ్ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజల్లో సామాజిక బాధ్యత, సామూహిక యాజమాన్య భావనను పెంపొందించాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 'హమారీ అంగన్‌వాడీ.. హమారీ జిమ్మేదారీ' అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ ఏడాది పోషణ్ మాహ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్ తీసుకోవడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజా వేడివేడి భోజనం అందించడం, బాల్య వికాసానికి పోషణ, తల్లుల ఆరోగ్యానికి ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా అందుతున్న ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేస్తూ పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్‌ఓ ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్, డీపీఆర్‌ఓ పి. శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## దేవరకద్ర అభివృద్ధికి భారీగా నిధులు..

## 73 కోట్ల 50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

**ఎమ్మెల్యే జియంఆర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని రహదారులు, వంతెనల నిర్మాణానికి భారీగా నిధులు**

దేవరకద్ర : దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, వంతెనల నిర్మాణం కోసం మొత్తం రూ.73 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ ప్రజల రాకపోకల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) ప్రత్యేక చొరవ తీసుకుని ఆయా పనుల అవసరాలను ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో ప్రభుత్వం స్పందించి, నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క గారు ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీని నేడు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) కి అందజేశారు. G.O. నం.477, 478 ద్వారా 73 కోట్ల 50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం.

1. పోతులమడుగు–గోపన్నపల్లి మార్గంలో HLB నిర్మాణానికి రూ.4 కోట్లు.
2. చిన్నవడ్డెమాన్–ఉంద్యాల మార్గంలో HLB నిర్మాణానికి రూ.3 కోట్లు.
3. పోల్కంపల్లి ఎస్సీ కాలనీ–కప్పేట మార్గంలో HLB నిర్మాణానికి రూ.3 కోట్ల 60 లక్షలు.
4. NH-44 నుంచి ఇస్రంపల్లి, పెద్ద మునగాల చెడ్ మీదుగా కౌకుంట్ల వరకు రహదారి అభివృద్ధి, నూదీ నిర్మాణానికి రూ.35 కోట్లు కేటాయించారు.
5. డోకూర్–చౌదర్‌పల్లి మార్గంలో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.7 కోట్ల 20 లక్షలు.
6. కౌకుంట్ల–రేకులంపల్లి మార్గంలో బ్రిడ్జికి రూ.1 కోటి 80 లక్షలు.
7. ఫరీద్‌పూర్ పీఆర్ రోడ్డు–గోప్యానాయక్ తండా మార్గంలో బ్రిడ్జికి రూ.3 కోట్ల 60 లక్షలు.
8. తిమ్మాపూర్–జనంపేట మార్గంలో బ్రిడ్జికి రూ.2 కోట్ల 70 లక్షలు.
9. దేవరకద్ర–ఆత్మకూర్ ౹ాఔణ రోడ్డులో కౌకుంట్ల–రాచాల, ఇస్రాంపల్లి వద్ద బ్రిడ్జికి రూ.5 కోట్ల 40 లక్షలు.
10. మదనాపూర్–NH-44 మార్గంలో పాలెం, దంతనూర్, రామనంతపూర్ మీదుగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.7 కోట్ల 20 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి.



ఈ నిధులతో నియోజకవర్గంలోని రహదారులు, వంతెనలు, మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయని ఎమ్మెల్యే జియంఆర్ పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకి ఎమ్మెల్యే జియంఆర్ ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ రూ.73 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) హర్షం వ్యక్తం చేస్తూ, నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు సాధించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## తప్పుడు లెక్కలతో సీడ్ పత్తి రైతుకు అప్పుల ఊబి!

**రూ.9 లక్షలు తిరిగి రావాలంటూ జిల్లా ఎస్పీకి రైతు ఫిర్యాదు**





సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల సీడ్ పత్తి సాగు కోసం సబ్ ఆర్గనైజర్ వద్ద విత్తనాలు, పెట్టుబడి తీసుకుని గత 15 ఏళ్లుగా పంట సాగు చేస్తున్న రైతు.. తప్పుడు లెక్కల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నానని ఆరోపిస్తూ జిల్లా ఎస్పీని ఆశ్రయించాడు. గద్వాల జిల్లా మల్దకల్ మండలం కుర్తిరావల చెరువు గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టు మండలం బోయలగూడెం గ్రామానికి చెందిన సబ్ ఆర్గనైజర్ భీమరాయుడు వద్ద సీడ్ పత్తి సాగు కోసం విత్తనాలు, పెట్టుబడి డబ్బులు తీసుకున్నాడు. గత 15 ఏళ్లుగా ఆయన వద్దనే పంట సాగు చేస్తున్నప్పటికీ అప్పు మాత్రం తగ్గకుండా పెరుగుతూ వచ్చిందని రైతు పేర్కొన్నాడు. ఇటీవల తన పంట సాగుకు సంబంధించిన లెక్కలను పూర్తిగా పరిశీలించగా.. తాను తీసుకున్న డబ్బులు, పంట దిగుబడికి సంబంధించిన లెక్కల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించానని ఆంజనేయులు ఆరోపించాడు. సబ్ ఆర్గనైజర్‌ను ఈ విషయంపై నిలదీయగా పొరపాటు జరిగిందని అంగీకరించాడని, పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించిన సమయంలోనూ ఈ విషయాన్ని ఒప్పుకున్నాడని తెలిపాడు. అయితే అనంతరం తిరిగి తన పొలం వద్దకు వచ్చి అప్పు చెల్లించాలని గొడవకు దిగడంతో తాను తీవ్ర ఇబ్బందులకు గురయ్యానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. చేసేదేమీ లేక ప్రజావాణిలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తప్పుడు లెక్కల కారణంగా తాను పండించిన పంటకు సుమారు రూ.9 లక్షలు తిరిగి రావాల్సి ఉందని, ఆ మొత్తాన్ని ఇప్పించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు ఆంజనేయులు ఫిర్యాదులో కోరాడు. తనకు అన్యాయం చేసినట్లు ఆరోపిస్తున్న సబ్ ఆర్గనైజర్ భీమరాయుడిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరాడు.





# 99 ప్యాకేజీ కుడి కాల్వపై వెంటనే బ్రిడ్జి నిర్మించాలి..

**- ప్రజల ఇబ్బందులకు కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే నిదర్శనం.**
**- టిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్‌కుమార్.**

ధరూర్: మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామ సమీపంలో 99 ప్యాకేజీ కుడి కాల్వను పూర్తిగా తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనికి కాంట్రాక్టర్ మరియు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే నిదర్శనమని టిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ రక్షణ సేన నాయకులతో కలిసి గుడ్డెందొడ్డి వద్ద 99 ప్యాకేజీ కుడి కాల్వ పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గుడ్డెందొడ్డి 99 ప్యాకేజి కుడి కాల్వ అత్యవసర సమయంలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌కు వెళ్లేందుకు, గురుకుల పాఠశాలకు చేరుకునేందుకు, వ్యవసాయ పొలాలకు రాకపోకలు సాగించేందుకు సరైన మార్గం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆయన తెలిపారు. కాల్వ నుండి విడుదలైన నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని పనుల్లో భాగంగా రహదారిని పూర్తిగా తవ్వి, బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు రాకపోకలు కష్టతరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములకు వెళ్లాలంటే రైతులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తీసుకెళ్లడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా ఈ మార్గం విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల రాకపోకలకు కీలకమైన ప్రాంతంలో కాల్వ తవ్వకాలు చేపట్టి ప్రత్యామ్నాయంగా బ్రిడ్జి ఏర్పాటు చేయకుండా పనులను వదిలేయడం కాంట్రాక్టర్ మరియు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి 99 ప్యాకేజీ కుడి కాల్వపై శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేస్తే ప్రజల తరఫున తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు బుచ్చిబాబు, మండల నాయకులు గోవిందు, మునెప్ప, అడివి ఆంజనేయులు, రాము, వెంకటేష్,ఆంజనేయులు,తిరుపతి, రామాంజనేయులు, జగదీష్, వెంకట్రాములు, విష్ణు,బలరాం నాయుడు, ప్రేమ్ రాజ్,గొర్ల తిమ్మప్ప, రాము, స్థానిక ప్రజలు,గ్రామస్తులు,రైతులు పాల్గొన్నారు.



# కాళోజీకి ఏ ఆర్ అదనపు ఎస్పీ ఘన నివాళి






**అన్యాయంపై అక్షర సమరం చేసిన ప్రజాకవి కాళోజీ**
**ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కాళోజీ సాహిత్యం కీలక పాత్ర**

వనపర్తి, సెప్టెంబర్ -09: బుధవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమాల గొంతుక శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని ఏ ఆర్ అదనపు ఎస్పీ శ్రీ వీరారెడ్డి పోలీసు కార్యాలయం అధికారులు, సిబ్బంది కలిసి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.."ప్రజల బాధను తన బాధగా భావించి, అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించిన మహోన్నత ప్రజాకవి కాళోజీ నారాయణరావు. తన కలం ద్వారా సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన ఆయన సేవలు చిరస్మరణీయం. కాళోజీ సాహిత్యం కేవలం రచనలకు పరిమితం కాకుండా ప్రజా చైతన్యానికి ఒక ఉద్యమంగా నిలిచింది. ఆయన ఆశయాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి. పోలీసు అధికారులు, సిబ్బంది కూడా ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని, నిష్పక్షపాతంగా, అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ, బాలాజీ నాయక్, పోలీస్ కార్యాలయం ఏఓ, సునంద, స్పెషల్ స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు,పర్వతాలు, రామేశ్వర్ రెడ్డి, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, వినోద్, మగ్దుం భారీ, పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, గోవింద్, పోలీస్ సిబ్బంది, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత స్పీకర్‌ను అవమానించడంపై కాంగ్రెస్ భారీ నిరసన




రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్: దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి షాద్‌నగర్ పట్టణంలోని ముఖ్య కూడలి వరకు భారీగా ర్యాలీ చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, తాత మధు దిష్టిబొమ్మలను పట్టుకుని నినాదాలు చేస్తూ ముఖ్య కూడలికి చేరుకున్నారు. అనంతరం దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. దళిత స్పీకర్‌ను అవమానించే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం సరికాదని, ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బాధ్యులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలపై జనసేన పార్టీ ధర్నా



నారాయణపేట: బుధవారం నాడు జిల్లా కేంద్రం లో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష పిలుపుమేరకు కలెక్టరేట్ ముందు ధర్నా లో నారాయణపేట జిల్లా జనసేనపార్టీ ముఖ్య నాయకులు కోస్గి విష్ణు వర్ధన్ రెడ్డి గుడిసె నరసింహ డాక్టర్ మణికంఠ గౌడ్ జాజాపూర్ కృష్ణ అరుణ్ కుమార్ గౌడ్ డీకే అశోక్ కుమార్ ఉమేష్ బాదేపల్లి నరేష్ గౌడ్ ఎల్ భీమేష్ బాలకృష్ణ కె ప్రవీణ్ భీమేష్ తేజ వెంకట్రావ్ మరియు వివిధ పార్టీ ల జిల్లా ఇంచార్జ్ లు చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ మరణం కోరిన వారిపై FIR నమోదు చేసి అరెస్టు చేయాలి

**షాద్నగర్ ఎమ్మెల్యే శంకర్ ను తక్షణమే అరెస్ట్ చేయాలి**
**బిఆర్ఎస్ వీపనగండ్ల మండల కమిటీ డిమాండ్**



సమయం ప్రతినిధి : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారిపై బహిరంగంగా మరణాన్ని కోరుతూ హాని చేయడానికి ప్రేరేపించేలా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో షాద్నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ కె శంకరయ్య తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మరియు పేర్లు వెల్లడించని ఇతర కుట్ర దారులపై భారతీయ న్యాయ సంహిత (BNS) 2023 లోని సెక్షన్లు 196,351/3,52, 353, మరియు 61, కింద ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని కోరుతూ ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ఎస్ ముఖ్య నాయకులు మండల అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, జల్లు నారాయణ, నారాయణరెడ్డి, ఏటూరి కురుమయ్య, రాజ వర్ధన్ రెడ్డి, కృష్ణయ్య గౌడ్, మంగ దొడ్డి బాలకృష్ణ, శేఖర్, సురేష్, శేఖర్ రెడ్డి, బండారి విష్ణు, గద్దల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరడుగొమ్ము మండల స్థాయి ఎస్జీఎఫ్ సెలక్షన్స్

దేవరకొండ: నేరడుగొమ్ము: సెప్టెంబర్ 9 (సమయం ప్రతినిధి) : నేరడుగొమ్ము మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి ఎస్జీఎఫ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో మండల పరిధిలోని ఉన్న అన్ని స్కూల్ల విద్యార్థుల పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఎంపిక ప్రక్రియలో క్రీడా ప్రతిభ, శారీరక సామర్థ్యం మరియు ఇతర నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గస్థాయి ఆటలలో పాల్గొంటారు. ఈ సెలక్షన్స్ ని ప్రారంభించడానికి మండల విద్యాధికారి తాటికొండ బ్రహ్మచారి, ఎస్సై నాగేంద్రబాబు వైస్ ప్రిన్సిపాల్ గణేష్,పీడీలు వెంకటేశ్వర్లు,కేతావత్ శ్రీను,చంద్రకళ,వెంకటేష్,ఉపాధ్యాయులు ఆంజనేయులు, యుగేందర్ రెడ్డి,శంకర్ గౌడ్,సుధాకారాచారి,పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంజీవ్,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## గద్వాల మళ్లీ బండ్లదేనా? ఎన్నికలు ఇప్పటికిప్పుడు జరిగితే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికే మొగ్గు.. చాణక్య సర్వే అంచనా?

గద్వాల : నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే పార్టీలకతీతంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి అనుకూల వాతావరణం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. చాణక్య సర్వే అంచనాల ప్రకారం కూడా ఏ పార్టీ నుండి పోటీ చేసిన గద్వాలలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఆధిక్యత ఉన్నట్లు తెలుస్తోందని చాణక్య సర్వేలో ప్రచారం జరుగుతోంది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 94,097 ఓట్లు సాధించి, కాంగ్రెస్ అభ్యర్థి సరిత తిరుపతయ్యపై 7,036 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తాజా రాజకీయ పరిణామాలు, స్థానిక పరిస్థితులు, పార్టీల బలాబలాలను పరిగణనలోకి తీసుకుంటే గద్వాలలో 2023లో జరిగిన ఎన్నికల పోటీ ఇప్పుడు జరిగే అవకాశం లేదనిపిస్తుంది. చాణక్య సర్వేలో బండ్లకు అనుకూలంగా వచ్చిన అంచనాలు నిజమై ఇదే గ్రాఫ్ ఎమ్మెల్యే బండ్ల నిలబెట్టుకుంటే గద్వాల రాజకీయాల్లో కృష్ణమోహన్ రెడ్డికి (హ్యాట్రిక్ విజయం) బలమైన సంకేతంగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు..





## కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు వేతనాల పెంపు, నైట్ డ్యూటీల రద్దు, పనిభారం తగ్గింపుకై

# సెప్టెంబర్ 11న జరిగే ఛలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి

**కొత్తకోట :** తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని, జాబ్ చార్ట్ కు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని, వర్కర్లకు వీక్లీ ఆఫ్ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని మరియు ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (�խజ×) సెప్టెంబర్ 11న "ఛలో హైదరాబాద్" ఆందోళనకు పిలుపునిస్తుందని టి యు సి ఏ జిల్లా ఉపాధ్యక్షులు సిరాజు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వనపర్తి జిల్లా అమరచింత, ఆత్మకూర్,మదనపూర్ ఖ+దీఎ హాస్టల్ లో కరపత్రం విడుదల చేసి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా ఖజ× జిల్లా ఉపాధ్యక్షులు జ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 495 కేజీబీవీలు కొనసాగుతున్నాయి. ఇందులో 403 కేజీబీవీలు ఇంటర్ వరకు పొడిగించబడ్డాయి. దేశవ్యాప్తంగా కేవలం మహిళలచే ఉత్తమ ఫలితాలతో విజయవంతంగా నడపబడుతున్నవి బహుశా కేజీబీవీలు మాత్రమే. అయితే గత 20 ఏళ్లుగా విజయవంతంగా నడపబడుతున్న కేజీబీవీల్లో, ఆ విజయానికి కారకులైన సిబ్బందికి మాత్రం ప్రభుత్వాలు అడుగడుగునా అన్యాయం చేస్తున్నాయి.

**వీక్లీ ఆఫ్ అమలు కాక, వెట్టిచాకిరి చేస్తున్న వర్కర్లు:**

కేజీబీవీల్లో పనిచేస్తున్న వంట మనుషులు, స్కావెంజర్లు, స్వీపర్లు, వాచ్ ఉమెన్లు, అటెండర్లు జాబ్ చార్ట్ కంటే అదనంగా పనిచేస్తున్నారు. వీరికి కనీసం వీక్లీ ఆఫ్ (వారానికి ఒక రోజు సెలవు) కూడా మెజారిటీ కేజీబీవీల్లో అమలు కావడం లేదు. కనీస విశ్రాంతి లేక తరచూ అనారోగ్యాల పాలవుతున్నారు. కొందరు మానసిక ఒత్తిడికి గురై, విధులకు రాజీనామా చేస్తున్నారు. ఆ భారం మిగతా సిబ్బందిపై పడుతున్నది. ఇప్పటికైనా వర్కర్లందరికీ వీక్లీ ఆఫ్ సక్రమంగా అమలయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలి. కంప్యూటర్, ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్లకు పార్ట్ టైం పేరుతో విధుల్లోకి తీసుకుని, ఫుల్ టైం పని చేయిస్తున్నారు. బొత్తడంతా జీతం సరిపోక, బయట మరోపని చేసుకోలేక గందరగోళానికి గురవుతున్నారు. వీరికి ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలి. స్కూలు, కాలేజీలున్న కేజీబీవీల్లో ఏఎన్ఎంలకు పనిభారం రెట్టింపయ్యింది. విద్యార్థినుల ఆరోగ్యాల కోసం ఆరాటపడి, వీరు అనారోగ్యాలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో వీరికి ప్రత్యామ్నాయం లేక అటు విద్యార్థులు ఇటు ఏఎన్ఎంలు ఇబ్బంది పడుతున్నారు. కాలేజీలున్న కేజీబీవీలో 2వ ఏఎన్ఎంను నియమించాలి.

**డ్యూటీ చార్టుకు భిన్నంగా నైట్ డ్యూటీలు:**

ఇప్పటికే తీవ్ర పనిభారాన్ని మోస్తున్న అకౌంటెంట్, వర్కర్లకు నైట్ డ్యూటీలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం, వారి పట్ల అధికారుల కక్షపూరిత వైఖరికి నిదర్శనం. అకౌంటెంట్లకు ఫైనాన్షియల్ సంబంధమైన విధులు ఉంటాయి. అకాడమిక్ బాధ్యతలతో వీరికి సంబంధమే ఉండదు. వీరి వేతనానికి, చేస్తున్న పనికి పొంతనే లేదు. ఇప్పటికే హెచ్ఎంఎస్ విధానంతో ఇబ్బందులు పడుతుంటే, అదనంగా నైట్ డ్యూటీలు చేయాలనడం అన్యాయం. ఇక వర్కర్లు డ్యూటీ చార్టుకు అదనంగా పనిభారం మోస్తున్నారు. వీక్లీ ఆఫ్ లు సమగ్రంగా అమలు కావడం లేదు. మళ్లీ వాళ్లకు నైట్ డ్యూటీలు కేటాయించడమంటే వారిని బానిసలుగా మార్చడమే అవుతుంది.

**అతి తక్కువ వేతనాలు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ అకౌంటెంట్, ఏఎన్ఎం లకు వేతనాలు నెలకి ?17755, మిగతా సిబ్బందికి ?14203 ఇస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ అకౌంటెంట్, ఏఎన్ఎం నెలకి రూ.14300/- , మిగతా సిబ్బందికి రూ.7800/- ల నుండి రూ.9750/- వరకు మాత్రమే వేతనాలిస్తున్నది. తెలంగాణ గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.15600/-ల నుండి రూ. 24000/- ల వరకు వేతనాలు వస్తున్నాయి. ఇది కేజీబీవీ సిబ్బంది పట్ల ప్రభుత్వ వివక్షతను తెలియజేస్తున్నది.

**హామీలు ఘనం - అమలు శూన్యం:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2006లో వచ్చిన జీవో నెంబర్ 14ను, ప్రస్తుతం జీవో నెం.60ని అమలు చేయకపోవడంవల్ల కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది సుదీర్ఘకాలంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పీఆర్సీ ఇచ్చిన నివేదిక ప్రకారం కనీస వేతనాలు అమలు కాలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రకటించిన కనీస వేతనాలు కూడా కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు అమలు కావడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధినేత, నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని, వీలైనంత త్వరగా కనీస వేతనాలు అమలు చేస్తానని, రెగ్యులరైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. తమ పార్టీ మేనిఫెస్టోలో చేర్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించారు. మన న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి, అధికారులకు మన సమస్యలను వివిధ రూపాల్లో తెలియజేస్తూనే ఉన్నాం. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2024 సంవత్సరంలో 07సార్లు, 2025 సంవత్సరంలో 05 సార్లు, ఈ సంవత్సరం ఇప్పటికే 05సార్లు ప్రభుత్వానికి, ప్రజాభవన్లో, ఎస్పీడీ కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఎస్పీడీ కార్యాలయం ముందు 02సార్లు 500 మందికి పైగా నాన్ టీచింగ్, వర్కర్లతో ధర్నా నిర్వహించి, సమస్యలు పరిష్కరించాలని విన్నవించడం జరిగింది. కానీ నాన్ టీచింగ్, వర్కర్లకు ప్రభుత్వం నుండి గానీ అధికారుల నుండి గానీ, ఎలాంటి ఉపశమనం లభించలేదు.

**ఇక పోరాటమే...**

మన పోరాటాన్ని తీవ్రతరం చేయడం తప్ప, మరో మార్గం లేని పరిస్థితులకి, ఈ ప్రభుత్వం మనల్ని నెట్టివేసింది. అందుకే అత్యంత న్యాయమైన మన డిమాండ్ల సాధన కోసం ఆందోళనలకు సిద్ధమవుదాం. అందులో భాగంగానే ఛలో హైదరాబాద్ కార్యక్రమం. రాష్ట్రంలోని అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్, వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని సెప్టెంబర్ 11న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం.

**ప్రధాన డిమాండ్లు:**

1.కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లకు కనీస వేతనం ?26వేలు ఇవ్వాలి. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన కనీస వేతనాలను అమలు చేయాలి.

2. అకౌంటెంట్, వర్కర్లకు జాబ్ చార్ట్ కు భిన్నంగా, ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలి.

3. వర్కర్లందరికీ వీక్లీ ఆఫ్ (వారానికి ఒకరోజు సెలవు) తప్పకుండా అమలు చేయాలి. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి.

4. పీ.ఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి. ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలి.

05.రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లకు పెంచాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. ఈ కార్యక్రమం లో TUCI జిల్లా ఉపాధ్యక్షులు జ రాజు, అనురాధ, పల్లవి, శోభ, చంద్రకళ, జ్యోతి,పద్మ, స్వర్ణ, ప్రవళిక, బాలమ్మ, పుష్ప,గౌతమి రాధ,తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



మక్తల్ :మున్సిపాలిటీ పరిధిలోని నారాయణపేట చౌరస్తా వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా చేపడుతున్న మరమ్మతు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వాకిటి మానస హనుమంతు పరిశీలించారు. లీకేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో మేగా కంపెనీ ఇంజనీర్, మున్సిపల్ సిబ్బంది, శానిటరీ సూపర్వైజర్ దేవదాస్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్స్ MLC ఎలక్షన్ సమావేశం

**- మూసాపేట్ మండలం వేముల గ్రామంలో ఘనంగా నిర్వహణ**



మూసాపేట్, సెప్టెంబర్ 9: మూసాపేట్ మండలం వేముల గ్రామంలో ఈరోజు భారతీయ జనతా పార్టీ (BJP) ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్స్ మీజ ఎలక్షన్ సభను అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. మూసాపేట్ మండల అధ్యక్షులు టి. కే. నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా మాజీ కార్యదర్శి నారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గట్టు మల్లేష్, గావిచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేట్స్ MLC ఎన్నికల ప్రాముఖ్యతను, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలోజిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొండా రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి మండల్ జనరల్ సెక్రటరీ తిరుపతయ్య,బీజేవైఎం విష్ణు, భాస్కర్ గౌడ్, బాలచ్చందర్, నరసింహ, అనంత రెడ్డి, గోవింద్ రెడ్డి,గణేష్, రాము, గోపాల్, శ్రీనివాస్ నాయక్, ప్రవీణ్, జలంధర్ రెడ్డి, క్రిష్ణ రెడ్డి,అచ్చుతా రెడ్డి తదితర ప్రముఖ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భాషా దినోత్సవంలో పాల్గొన్న ఎంపీ అరుణ

(సమయం ప్రతినిధి నారాయణపేట)నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనడం, విద్యార్థులతో మాట్లాడడం ఎంతో సంతోషాన్నిచ్చిందని మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ పేర్కొన్నారు. ముందుగా ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నా ఆలోచనలను పంచుకున్నాను. ఎన్ని భాషలు నేర్చుకున్నా మన మాతృభాషను ఎప్పటికీ మరువకూడదు. ఇంగ్లీష్ మాట్లాడితేనే గొప్ప అనే భావన సరికాదు. అవసరానికి తగినట్లు అన్ని భాషలు నేర్చుకోవాలి కానీ, తెలుగును మాత్రం నిర్లక్ష్యం చేయరాదు. బయట ఏ భాష మాట్లాడినా, ఇంట్లో కుటుంబంతో తెలుగులోనే మాట్లాడాలి. 'అమ్మ' అనే పదంలో ఉన్న కమ్మదనం మరే భాషలోనూ లభించదు. విద్యార్థులు కష్టపడి చదివి, సద్గుణాలు అలవర్చుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి. విద్యతో పాటు పెద్దలను గౌరవించే సంస్కారం కూడా అలవరచుకోవాలి. మన పాఠశాల పీఎం శ్రీ (PM SHRI) పథకానికి ఎంపిక కావడం గర్వకారణం. దీని ద్వారా డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ సహా అన్ని మౌలిక వసతులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. విద్యార్థులందరూ వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో నాతో



పాటు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్, నాయకులు బలరాం రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, లక్ష్మీ శ్యామ్ సుందర్, పట్టణ ప్రముఖులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 356, 352 కింద కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అలాగే, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌కి ఎంపీ ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌పై.. కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు పరువు నష్టం, అనుచితంగా ఉన్నాయని ఎంపీ ఆరోపించారు. కేటీఆర్‌పై పలు సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేయాలని సీపీ సజ్జనార్‌కి విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా, మీడియా ఆధారాలను భద్రపరచాలని ఎంపీ మల్లు రవి కోరారు. బీఆర్ఎస్ సభ్యులు వ్యక్తి ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నారని ఎంపీ మల్లు రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా మాజీమంత్రి హరీశ్‌రావు ప్రవర్తన ఉందని ధ్వజమెత్తారు. ఫాంహౌస్ కేంద్రంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కుట్ర చేస్తున్నారని ఆగ్రహించారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



వేకువ సమయం కీసర, సెప్టెంబర్ 9: పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి ఏటా తన పుట్టినరోజు సందర్భంగా అలిపిరి మెట్ల మార్గంలో నడుచుకుంటూ తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అనుచరులతో కలిసి అలిపిరి నుంచి మెట్ల మార్గంలో ఏడుకొండలను అధిరోహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని శ్రీవారిని వేడుకున్నట్లు తెలిపారు. పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకోవడం తనకు ఎంతో ఆధ్యాత్మిక ఆనందం, మనశ్శాంతిని కలిగిస్తుందని పేర్కొన్నారు. మల్లారెడ్డితో పాటు ఘట్కేసర్ సహకార బ్యాంకు డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.





# మదనాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**నిమజ్జన ప్రదేశాలు సరళ సాగర్, రామన్‌పాడ్, కొత్తపల్లి బ్రిడ్జ్ ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ**
**అన్నిశాఖల సమన్వయంతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు సూచనలు**
**సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు**
**చిన్న ఘటన కూడా పెద్ద సమస్యగా మారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**




వనపర్తి : ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని, అదే సమయంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, అన్నారు.బుధవారం రోజు వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, మదనాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి ఫిర్యాదుల స్వీకరణ, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, ఫిర్యాదుల నమోదు, పరిష్కార విధానం, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, సమస్యాత్మక వ్యక్తుల రికార్డులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గణేష్ ఉత్సవాల సందర్భంగా మదనాపూర్ మండలంలోని నిమజ్జన ప్రదేశాలు సరళ సాగర్, రామన్‌పాడ్, కొత్తపల్లి బ్రిడ్జ్ ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గణేష్ నిమజ్జనోత్సవాలను సమన్వయం అప్రమత్తతతో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ,.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రాత్రింబవళ్లు పెట్రోలింగ్, నిఘా చర్యలు కొనసాగిస్తూ ఆకతాయిలు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వ్యక్తులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, సోషల్ మీడియా వేదికల్లో అసత్య ప్రచారాలు, వదంతులు, ప్రజలను రెచ్చగొట్టే పోస్టులు లేదా చట్టవ్యవస్థకు భంగం కలిగించే సందేశాలను ప్రచారం చేసే వారిని గుర్తించి సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలు ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకునే పండుగ. ఈ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చూడటం పోలీస్ శాఖ యొక్క ముఖ్యమైన బాధ్యత. ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు అవకాశం లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి. చిన్నపాటి ఘటన కూడా పెద్ద సమస్యగా మారకుండా ముందుగానే గుర్తించి నివారించే విధంగా ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. "గణేష్ మండపాల నుంచి నిమజ్జన ప్రదేశాల వరకు నిరంతర నిఘా కొనసాగాలి. సమస్యాత్మక వ్యక్తులు, గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిమజ్జన రూట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, ఈవ్‌టీజింగ్, ఆకతాయితనం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, కొత్తకోట సీఐ,ఓడి రమేష్, వనపర్తి సీఐ,సుగంధరత్నం, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, మదనాపూర్ ఎస్సై, జగదీశ్వర్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు

---

# మెడిసిన్‌లో మెరిసిన చిమనగుంటపల్లి విద్యార్థినులు




**448, 417 మార్కులతో ఉచిత మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థినులు దివ్యశ్రీ, లీనా మధురకు ఘన సన్మానం.....**
**పేద కుటుంబాల నుంచి వచ్చి ప్రతిభ చాటడం అభినందనీయం: లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

వనపర్తి : వనపర్తి మండలం చిన్నగుంటపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినులు దివ్యశ్రీ, లీనా మధుర వైద్య విద్యలో సీట్లు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ ధర్మశాస్త్రి కూతురు దివ్యశ్రీ 448 మార్కులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు పానుగంటి రాము కూతురు లీనా మధుర 417 మార్కులు సాధించి ఫ్రీ మెడికల్ సీట్లు పొందారు.ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని విద్యార్థినులను ఘనంగా సన్మానించి అభినందించారు. పేద కుటుంబాల నుంచి వచ్చి కష్టపడి చదివి వైద్య విద్యలో సీట్లు సాధించడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. భవంతు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, రమేష్ నాయక్, విష్ణు గౌడ్, ఆటో రాము, సత్యనారాయణ చారి, నాగేష్ తదితరులు పాల్గొని దివ్యశ్రీ, లీనా మధురలను అభినందించారు.

---

# 48వ చాతుర్మాస మహోత్సవాలలో పాల్గొన్న గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి TGSGDCFL శ్రీమతి సరిత తిరుపతయ్య



గద్వాల : ధరూర్ మండల కేంద్రంలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 15వ శతాబ్దం నాటి వ్యాసరాయల వారి కాలంలో స్వయంభూగా వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న 48వ చాతుర్మాస మహోత్సవాలలో గద్వాల్ నియోజకవర్గ ఇంచార్జి & TGSGDCFL ఛైర్పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆద్య మాధ్వాచార్యులచే ఆమెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతం, విశేష సుగంధ ద్రవ్యాలతో ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. శ్రీమతి సరిత తిరుపతయ్య వరుణ యాగంలో పాల్గొన్నారు. అనంతరం ఉడిపి పలిమార్ మఠ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు, శ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారి దివ్య సన్నిధిలో శాస్త్రోక్తంగా జరిగిన సుదర్శన చక్ర మండల పూజలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుని దివ్యాయుధమైన సుదర్శన చక్రానికి పీఠాధిపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీమతి సరిత తిరుపతయ్యలికి పట్టు వస్త్రాలు సమర్పించి సత్కరించారు. స్వామీజీలు ఆమె వెంట వచ్చిన కార్యకర్తలకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు, మంత్రాక్షతలు, ఫలాలు పంపిణీ చేశారు. వేద పండితులు భక్తులందరికీ వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు సర్పంచ్ లు మండల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

# భార్యల బదులు భర్తలు.. సర్వసభ్య సమావేశానికి హాజరు!



**అధికారులు ఎలా అనుమతించారో..**
**మల్దకల్ మండల సమావేశంలో వెలుగులోకి**

సమయం ప్రతినిధి: గద్వాల జిల్లా గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆసక్తికర ఘటన వెలుగులోకి వచ్చింది. మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు సమావేశానికి హాజరై పాల్గొన్నట్లు సమాచారం. మహిళా ప్రజాప్రతినిధులుగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించాల్సిన చోట వారి భర్తలు సమావేశాలకు హాజరుకావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మహిళలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ, కొన్ని చోట్ల మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు లేదా కుటుంబ సభ్యులే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మల్దకల్ మండలంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో భార్యల బదులు భర్తలు పాల్గొన్న విషయంపై అధికారులు వారికి ఎలా అనుమతి ఇచ్చారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమావేశంలో పాల్గొనే అర్హత, అధికారిక హాజరు వంటి అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మహిళా ప్రజాప్రతినిధులను కేవలం సంతకాలకే పరిమితం చేసి, కీలక నిర్ణయాల్లో వారి భర్తలే జోక్యం చేసుకుంటే మహిళా సాధికారత లక్ష్యం దెబ్బతింటుందని మహిళా సంఘాలు, ప్రజలు అంటున్నారు.మహిళలకు పదవులు ఇస్తూ.. అధికారాలను మాత్రం భర్తల చేతుల్లో పెట్టడం ఎంతవరకు సమంజసం? అనే చర్చ ప్రస్తుతం మల్దకల్ మండలంలో సాగుతోంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, సమావేశానికి భర్తలు ఏ ప్రాతిపదికన హాజరయ్యారో వెల్లడించాల్సి ఉంది.

---

# కల్లు దొంగలకు ఇక చెక్ పెట్టాల్సిందే!

**తోటబాయి వద్ద రాత్రికి రాత్రే మాయం అవుతున్న ఈత కల్లు..**
**గౌడ కార్మికుల ఆవేదన**

వేకువ సమయం సెప్టెంబర్ 9 కీసర ప్రతినిధి : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర డివిజన్ -1పరిధిలోని తోటబాయి సమీపంలో ఈత కల్లు దొంగతనాలు జరుగుతున్నాయంటూ.. గౌడ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గౌడ కార్మికులు రోజంతా శ్రమించి ఈత చెట్లను గీసి సేకరించిన కల్లు, వారు ఇంటికి వెళ్లిన తర్వాత రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి తీసుకెళ్తున్నారని ఆరోపిస్తున్నారు.ఉదయం చెట్ల వద్దకు వెళ్లి చూడగా సేకరించిన కల్లు కనిపించకపోవడంతో తమ శ్రమ వృథా అవుతోందని కార్మికులు వాపోతున్నారు. వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండటంతో తమ జీవనోపాధికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.కల్లు దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రాత్రివేళ నిఘా పెంచాలని గౌడ కార్మికులు కోరుతున్నారు. ఇకపై దొంగతనాలకు పాల్పడే వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.ఈ రోజు నుంచి ఈత చెట్ల వద్ద రాత్రివేళ నిఘా పెంచి, కల్లు దొంగలను పట్టుకునేందుకు కఠిన చర్యలు చేపడతామని గౌడ కార్మికులు స్పష్టం చేశారు.

---

# వారం రోజుల పోరుబాటను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు

**- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



దేవరకొండ: సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల దగా పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చేపట్టిన "వారం రోజుల పోరుబాట" కార్యక్రమాలను విజయవంతం చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, యువత, మహిళలు మరియు ప్రజలందరికీ దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....తనపై ఉన్న గౌరవం, అభిమానంతో తమ వ్యక్తిగత పనులను సైతం పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాటకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై తన పోరాటం ఎప్పటికీ ఆగదని, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ప్రజల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత బలమైన పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

# భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి





**ప్రభుత్వ, అటవీ భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలి**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 9:** నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు.బుధవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని చెన్నారం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే పనుల పురోగతిని అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు. చెన్నారం గ్రామంలో మొత్తం 76 సర్వే నంబర్ల పరిధిలో 847 ఎకరాల 20 గుంటల భూమి ఉన్నట్లు, ఇందులో 147 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు ఏడి ల్యాండ్ సర్వే గిరిధర్ కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన రీ-సర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, రైతులకు సంబంధించిన భూముల రీ-సర్వే పనులను నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపడుతూ కొనసాగిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల పరిధిలో 70 గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలించిన అనంతరం మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా పరిశీలించి, భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను పక్కాగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు అవకాశం లేకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.పాఠశాలలో ఉన్న పుస్తకాలను విద్యార్థులకు వినియోగంలోకి ఎందుకు తీసుకురావడం లేదని కలెక్టర్ హెడ్మాస్టర్ ను ప్రశ్నించారు. పుస్తకాలను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని సూచించారు. గ్రామ పర్యటన సందర్భంగా గ్రామ సర్పంచ్ హేమలత గ్రామంలో నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిశీలించిన కలెక్టర్, గ్రామపంచాయతీ నిధుల నుంచి అవసరమైన చర్యలు చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే గిరిధర్, తాహసిల్దార్ సైదులు , సంబంధిత అధికారులు, సిబ్బంది, గ్రామ సర్పంచ్ ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు: కలెక్టర్




గద్వాల: గద్వాల ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం గద్వాలలోని ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్, మార్షల్ ఆర్ట్స్ విభాగాలను పరిశీలించి అవసరమైన పనులపై అధికారులకు సూచనలు చేశారు. స్టేడియం ప్రహరీపై క్రీడలకు సంబంధించిన పెయింటింగ్స్‌తో పాటు ప్రముఖ క్రీడాకారుల చిత్రాలు, వారి వివరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.బ్యాడ్మింటన్ కోర్టులో సింథటిక్ మ్యాట్, లైటింగ్ ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేడియంలోని ఫ్లడ్‌లైట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఇన్‌చార్జి డీవైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, స్టేడియం ఇన్‌చార్జి బషీర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**ఆత్మకూర్ బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ నాయకులు**




వనపర్తి జిల్లా : ఆత్మకూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నందు ఆత్మకూర్ టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారిపై షాద్నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు చావు కోరుతూ చేసిన వ్యాఖ్యలను చట్టపరమైన చర్య కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.

## కాళోజీ స్ఫూర్తి చిరస్మరణీయం



జడ్చర్ల సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధి : ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్ఓ జె.ఎల్.బి. హరిప్రియ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సమాజం, ప్రజల హక్కుల కోసం కాళోజీ చేసిన సేవలను, ప్రజా చైతన్యానికి ఆయన అందించిన సాహిత్య సేవలను అధికారులు స్మరించుకున్నారు. కాళోజీ ఆశయాలు, రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ గిరీష్ , హర్ష తదితరల పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ కరోలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీఐ ప్రచార సమితి ప్రతినిధులు



దేవరకొండ: సెప్టెంబర్ 9 (సమయం ప్రతినిధి) : దేవరకొండకు నూతనంగా విచ్చేసిన సబ్ కలెక్టర్ కరోలిన్ గారిని ఆర్టీఐ ప్రచార సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీఐ ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాట్రావత్ రాజు నాయక్ మాట్లాడుతూ, దేవరకొండ ప్రాంతంలో ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంపొందించేందుకు ఆర్టీఐ ప్రచార సమితి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.నూతన సబ్ కలెక్టర్ కరోలిన్ ఆధ్వర్యంలో దేవరకొండ డివిజన్ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందాలని సమితి నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ ప్రచార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్ నాయక్, సీనియర్ సలహాదారుడు లక్ష్మీనారాయణ, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నారమోని హరీష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామావత్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆత్మగౌరవ ప్రదర్శన



**వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం**

వేకువ సమయం సెప్టెంబర్ 9 కీసర ప్రతినిధి: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో తూంకుంటలో భారీ ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించారు.తూంకుంట చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ శ్రేణులు.. అనంతరం డప్పుల దరువులతో, ఆత్మగౌరవ నినాదాలతో భారీ ప్రదర్శన చేపట్టారు. వేలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొని బీఆర్ఎస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నేతలు హద్దులు దాటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి పదవులపై కూడా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ.. “మన ఆత్మగౌరవం కోసం.. మన ప్రజాస్వామ్యం కోసం ఐక్యంగా పోరాడుతాం. రాజ్యాంగబద్ధమైన పదవులను అవమానించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ SIR ఇన్‌చార్జి గజ్జల కాంతం, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యుడు మొహమ్మద్ ముజీబ్ రుద్దిన్, జిల్లా =ూా సభ్యుడు జైపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ కీసర డివిజన్ -1 అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెలిదే రమేష్ గుప్తా, మచ్చాని జంగయ్య యాదవ్,తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేశారు.

# ముందే గుర్తిస్తే క్యాన్సర్ ను జయించవచ్చు

- మహిళలందరూ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలి
- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి
- శ్వేతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



జడ్చర్ల సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధి: ముందే గుర్తిస్తే చికిత్స ద్వారా క్యాన్సర్ ను పూర్తిగా నయం చేయవచ్చని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి అన్నారు. ప్రతి ఒక్క మహిళా తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.కీ.శే. చర్లకొల శ్వేత ద్వితీయ వర్ధంతి సందర్భంగా మహిళల కోసం శ్వేతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలోని గౌడ ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.లక్ష్మారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... “నేడు మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ కేసులు ఎక్కువవుతున్నాయి. భయం, నిర్లక్ష్యం వల్ల చాలామంది చివరి దశలో బయటపడుతున్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి మహిళ ఏడాదికి ఒకసారి స్క్రీనింగ్ చేయించుకోవాలి. ప్రారంభ దశలో గుర్తిస్తే 90 శాతం నయం అయ్యే అవకాశం ఉంది” అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోందని..చాలా మందికి అనేక రకాల క్యాన్సర్లు వస్తున్నాయన్నారు. క్యాన్సర్ వచ్చాక బాధపడడం కన్నా అది రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు.క్యాన్సర్ మహమ్మారిని ముందుగా గుర్తిస్తే ట్రీట్మెంట్ ద్వారా నయం చేసే అవకాశం ఉంటుందని...అందుకోసమే ప్రత్యేకంగా మహిళల కోసం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. గురువారం కూడా గౌడ ఫంక్షన్ హాల్ లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గురువారం కూడా క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్థిక స్వేచ్ఛ పేరుతో 1/70 చట్ట సమీక్షా?!




**సమయం ప్రతినిధి :** మంథనపు రామారావు రాసిన వ్యాసంలో లేవనెత్తిన అనేక అంశాలు ప్రశ్నించదగినవి. రెగ్యులేషన్ 1/70 రద్దుకోరుతూ సుప్రీంకోర్టులో వేలాది మంది గిరిజనేతరులు దాఖలు చేసిన కేసు నేపథ్యంలో ఈ వాదనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. '1/70 చట్టం గిరిజనుల భూమిని కాపాడింది, కానీ వారి ఆర్థిక స్వేచ్ఛను హరించింది' అన్నది ఆయన ప్రధాన వాదన. పక్క మండలాల్లో ఎకరానికి రూ.40–50 లక్షలు పలుకుతున్న భూమి, 1/70 పరిధిలో రూ.10 లక్షలు కూడా పలకడం లేదని ఆయన ఎత్తిచూపారు. ఇందులో వాస్తవం లేకపోలేదు. కానీ దాని ఆధారంగా చట్టాన్ని బలహీన పరచాలనుకోవడం చారిత్రక వాస్తవాలను, రాజ్యాంగ లక్ష్యాన్ని విస్మరించడమే అవుతుంది. ఆదివాసీ సమాజానికి భూమి కేవలం మార్కెట్ వనరు కాదు.. అదే జీవనాధారం, సంస్కృతి, సామాజిక అస్తిత్వం కూడా. అందుకే రాజ్యాంగ నిర్మాతలు అయిదో షెడ్యూల్ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ కల్పించారు. వ్యాసకర్త తానే స్వయంగా ఒక కీలక వాస్తవాన్ని అంగీకరించారు– '1970 తర్వాత గిరిజనేతరుల నుంచి చట్టబద్ధమైన క్రయవిక్రయాల ద్వారా గిరిజనులకు కొత్తగా సంక్రమించిన భూమి చాలా తక్కువ' అని. ఈ ఒక్క వాక్యం ఆయన మొత్తం వాదననే బలహీనపరుస్తున్నది. గిరిజనులు స్వేచ్ఛా మార్కెట్‌లో భూమిని కొనలేకపోవడానికి కారణం చట్టం కాదు.. వారి ఆర్థిక వెనుకబాటుతనం, రుణ లభ్యత లేమి. రెగ్యులేషన్ ఆంక్షలు ఉన్నప్పటికీ మోసపూరిత ఒప్పందాలు, బినామీ లావాదేవీల ద్వారా వేలాది ఎకరాల గిరిజన భూమి ఇప్పటికే గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లిపోయింది. గిరిజనుల జీవితాలు ఆర్థికంగా ఛిద్రమైపోయాయి. నేటికీ 50 శాతానికి పైగా ఏజెన్సీ భూమి గిరిజనేతరుల ఆధీనంలోనే ఉందని ప్రభుత్వ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. 'గిరిజనేతరుల మధ్య వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, ఒప్పందాలు, ఇతర మార్గాల ద్వారా పెద్ద ఎత్తున భూ లావాదేవీలు జరిగాయి. ఈ వ్యవహారాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్రమంగా పెద్ద ఎత్తున సంపాదించుకున్నారన్నది బహిరంగ రహస్యం' అని వ్యాసకర్త పేర్కొన్నారు. ఇది రెగ్యులేషన్ 1/70కి వ్యతిరేకమైన ఆధారం కాదు, చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాల్సిన అవసరాన్ని బలపరిచే వాస్తవం. చట్టాన్ని ఉల్లంఘించి జరిగిన లావాదేవీలపై నిలదీయాల్సింది పోయి, చట్టం వల్లే నష్టం జరిగిందని చెప్పడం ఏకపక్ష వాదనగా కనిపిస్తున్నది. అసలు ప్రశ్నించాల్సింది చట్టాన్ని కాదు.. వ్యవస్థల వైఫల్యాలను, ఓటు బ్యాంకు రాజకీయాలను. కోనేరు రంగారావు భూ కమిటీ (2004) ఇదే విషయాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది. గిరిజనులకు అనుకూలంగా వచ్చిన ఉత్తర్వులు అమలుకాకపోవడం, భూ రికార్డుల్లో లోపాలు పాలనా వైఫల్యాలేనని పేర్కొంది. భద్రాచలం ఏజెన్సీలో సుమారు రూ.75 కోట్లు విలువ చేసే 15 వేల ఎకరాల భూమి ఒక చెల్లని ప్రభుత్వ ఉత్తర్వు కింద గిరిజనేతరుల అధీనంలో ఉన్నట్లు, ఉట్నూర్ మండలంలో సుమారు 21,062 ఎకరాల భూమి పాత పట్టా కింద నమోదై ఉన్నట్లు కమిటీ గుర్తించింది. చెల్లని పట్టాలు రద్దు చేసి భూమిని గిరిజనులకే కేటాయించాలని కమిటీ సిఫార్సు చేసింది. అయినా, ఈ ఆదేశాలను అమలు చేయాల్సిన యంత్రాంగమే వెనుకంజ వేసింది. పైగా 2016 నుంచి తెలంగాణలో 'సాదా బైనామా' క్రమబద్ధీకరణతో గిరిజనేతరుల అక్రమ భూముల క్రమబద్ధీకరణ మరింత పెరిగింది. రెవెన్యూ రికార్డుల శుద్ధి, కంప్యూటరీకరణ పేరుతో గిరిజనుల భూమి గిరిజనేతరుల పేర నమోదయిపోయింది. ఈ ఉదాహరణలన్నీ చెప్పేది ఒక్కటే–లోపం చట్టంలో లేదు, దాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలో ఉంది. 'గిరిజన రైతు తన భూమికి సరైన సమయంలో సరైన విలువ పొందడానికి 1/70 చట్టం అడ్డంకిగా మారింది' అన్న వాదన వాస్తవానికి పూర్తి విరుద్ధం. రెగ్యులేషన్ చేసేది ఒక్కటే.. గిరిజనేతరులకు గిరిజన భూమి వెళ్లకుండా అడ్డుకోవడం. గిరిజనుడు తన భూమిని మరొక గిరిజనుడికి విక్రయించుకోవచ్చు; అందుకు తగిన మార్కెట్ అనుసంధానం కల్పించాల్సింది ప్రభుత్వమే. గిరిజన భూమి విలువ పెరగకపోవడం చట్టం లోపం కాదు, చిత్తశుద్ధి లేని పాలకుల వైఫల్యం. గిరిజన ప్రాంతాల్లో ఆర్థిక అవకాశాలు పెరగాలన్న వ్యాసకర్త ఆందోళన సహేతుకమే. కానీ దానికి పరిష్కారం భూమిని స్వేచ్ఛా మార్కెట్‌కు వదిలేయడం కాదు. ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ అనుసంధానం, సూక్ష్మ రుణ సదుపాయాల ద్వారా ఆర్థిక సాధికారతే నిజమైన పరిష్కారం. వాస్తవానికి చర్చించాల్సింది చట్టాన్ని సమీక్షించడం కాదు, రాజ్యాంగం కల్పించిన రక్షణలను సమర్థవంతంగా అమలు చేయడం ఎలాగన్నదే. భూమిని కోల్పోయిన ఆదివాసీ కేవలం ఆస్తిని మాత్రమే కాదు, తన సంస్కృతిని, గుర్తింపును కూడా కోల్పోతాడు. అసలు ప్రశ్నకు జవాబు... రెగ్యులేషన్ 1/70ను మరింత పటిష్ఠంగా అమలు చేయడంలోనే ఉంది, దాన్ని బలహీనపరచడంలో కాదు.

# ఆహార భద్రతపై ఆహార కమిషన్ క్షేత్రస్థాయి తనిఖీలు



వేకువ సమయం సెప్టెంబర్ 9 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజిగిరి, జిల్లాలో ఆహార భద్రతా పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాలపై తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ దృష్టి సారించింది. ఈ నెల 11న ఆహార కమిషన్ ఛైర్మన్, సభ్యులు జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నారు. పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కమిషన్ బృందం ప్రత్యక్షంగా పరిశీలించనుంది. ప్రజలకు అందుతున్న రేషన్ సరుకుల పంపిణీ, పాఠశాలలు–అంగన్‌వాడీల్లో పోషకాహార కార్యక్రమాల అమలు, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ప్రయోజనాల చేరువ వంటి అంశాలను పరిశీలించే అవకాశం ఉంది. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వీజన కిట్‌ల పంపిణీ, గర్భిణీలకు అందుతున్న ప్రసూతి ప్రయోజనాలు, జాతీయ ఆహార భద్రతా చట్టం–2013లోని సెక్షన్ 4(బి) ప్రకారం అమలు జరుగుతున్న విధానాన్ని కమిషన్ పరిశీలించనుంది.

**ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

క్షేత్రస్థాయి పర్యటనలో ప్రజలకు తమ సమస్యలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించనున్నారు. రేషన్ పంపిణీలో ఇబ్బందులు, అర్హత ఉన్నప్పటికీ ప్రయోజనాలు అందకపోవడం, అంగన్‌వాడీ–పాఠశాలల్లో ఆహార నాణ్యత, గర్భిణీలు–బాలింతలకు అందాల్సిన ప్రయోజనాల్లో జాప్యం వంటి సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావచ్చని అధికారులు తెలిపారు.

**అధికారులతో సమీక్ష :** క్షేత్రస్థాయి పర్యటన అనంతరం అదే రోజు లిమేడ్చల్–మల్కాజిగిరి సమీకృత జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ (IDOC)లో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో ఆహార భద్రతా చట్టం అమలు, వివిధ సంక్షేమ పథకాల పురోగతి, క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కార చర్యలపై అధికారులతో కమిషన్ సమీక్షించనుంది. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారం, తాజా గణాంకాలు, రికార్డులు, పథకాల అమలుకు సంబంధించిన ఆధారాలతో సమావేశానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కమిషన్ పర్యటన నేపథ్యంలో అధికారులు తమ పరిధిలోని రికార్డులను సిద్ధం చేసుకుంటున్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజి నారాయణరావు 112 వ జయంతి వేడుకలు




వనపర్తి. సమయం ప్రతినిధి : కాళోజి నారాయణరావు 112వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వనపర్తి నందు తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి ఈశ్వరయ్య మాట్లాడుతూ కాలోజి నారాయణరావు తెలంగాణ భాషకు సేవ చేయడం జరిగిందని, తెలంగాణ యాసను భాషను ఇతరులు వెక్కిరించి చూసినప్పుడు బడి పలుకుల భాష, పలుకుబడుల భాషని రెండు రకాలు ఉంటుందని మేము పలుకుబడుల భాషని వాడుతామని చెప్పినటువంటి తెలంగాణ భాషవాది కాళోజి నారాయణరావు అని అన్నారు. తెలంగాణలో జరిగిన ప్రతి ఉద్యమ కార్యక్రమంలో కాలోజి నారాయణరావు పాత్ర ఉందని, కాలోజీ నారాయణరావు రాసిన నా గొడవ అనే కవితల సంపుటిలో తెలంగాణ యాస భాష ఉందని దీనిని గాను కేంద్ర ప్రభుత్వం వారు పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామరాజు యాదవ్ అధ్యాపకులైన శ్రీనివాసులు, జోగు సంజీవయ్య, దౌలమ్మ, మంజుల, రూప,స్రవంతి,మణిదీప,విజయలక్ష్మి,కాజన్న,మహబూబ్ పాషా, రాహుల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




సమయం ప్రతినిధి : సెలబ్రిటీలు తమ ఇళ్లను భిన్నంగా, లగ్జరీగా కట్టుకోవాలనుకుంటారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాలరాతి సౌధాలు, ఇంద్రభవనాలను నిర్మించుకుంటారు. అయితే మైకేల్ జాక్సన్ మాత్రం ఓ ఇంటికి బదులుగా ఏకంగా ఫాంటసీ ప్రపంచాన్నే నిర్మించారు. 2,700 ఎకరాల్లో ఉండే ఆ ప్రపంచంలో జూ, సినిమా థియేటర్ ప్రైవేట్ పార్కు, రైల్వే స్టేషన్ ఇలా అన్నీ ఉంటాయి. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ రాంచ్(పశువులను పెంచే వ్యవసాయ క్షేత్రం)ను మైకేల్ జాక్సన్ 1983లో కొనుగోలు చేశారు. ఆ తరువాత దానికి నెవర్‌ల్యాండ్ అనే పేరు పెట్టి ప్రైవేట్ ఫాంటసీ వరల్డ్‌గా మార్చారు. ఆ తరువాత నెవర్‌ల్యాండ్‌నే తన నివాసం చేసుకున్నారు. అందులో ఓ పెద్ద నీటి కొలను, రైల్వే స్టేషన్, మైమరిపించే పార్కులను ఏర్పాటు చేశారు. అక్కడ ఓవైపు జలపాతం, రాతి వంతెన, పూలతోటలు కనువిందు చేస్తే.. మరోవైపు ప్రైవేట్ జూ పార్క్, సినిమా థియేటర్ మరింత వినోదాన్ని పంచుతాయి. ఈ ప్రకృతి సౌందర్యం మధ్యలో రైలుబండి 'కూ.. చుక్ చుక్.!' అంటూ పరుగులు పెడుతుంది. ఆ రైలులోంచి ఈ సొగసులన్నీ చూస్తే ఎవరికైనా ఒళ్లు పులకరించాల్సిందే! ఇలా మాటల్లో వివరించేందుకు, వర్ణించడానికి సాధ్యపడని రీతిలో ఆయన నెవర్‌ల్యాండ్ పేరిట తన ఫాంటసీ ప్రపంచాన్ని తీర్చిదిద్దారు.

**మసకబారిన నెవర్‌ల్యాండ్ కళ..**

అయితే.. ఈ నెవర్‌ల్యాండ్ ఆ తరువాతి కాలంలో తన ప్రాభవాన్ని కోల్పోయింది. 2003లో ఓ క్రిమినల్ కేసు దర్యాప్తులో పోలీసులు నెవర్‌ల్యాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. అప్పటి నుంచి మైకేల్ జాక్సన్ అక్కడ నివసించడం మానేశారు. 2009లో ఆయన మరణానంతరం నెవర్‌ల్యాండ్ ఆర్థిక చిక్కుల్లో పడింది. దీంతో ఆ ఆస్తులను ఒక్కొక్కటిగా అమ్మేశారు. మెల్లగా ఆ ఫాంటసీ ప్రపంచం తన ఉనికిని కోల్పోవడం మొదలుపెట్టింది. 2015లో దాని పేరును కూడా మార్చేశారు. ఆ సంవత్సరంలోనే రాంచ్‌ను 100 మిలియన్ డాలర్లకు విక్రయానికి పెట్టగా ఎవరూ కొనడానికి ముందుకు రాలేదు. ఆ తర్వాత దాని ధరను 67 మిలియన్ డాలర్లకు తగ్గించినా అమ్ముడుపోలేదు. చివరికి 2020లో ఓ వ్యాపారవేత్త రాంచ్‌ను 22 మిలియన్ డాలర్లకు దక్కించుకున్నారు. ఇప్పటికీ ఆ రాంచ్ అక్కడే ఉంది. కానీ నెవర్‌ల్యాండ్ లేదు. 2,700 ఎకరాల ప్రాపర్టీ అక్కడే ఉంది. కానీ దశాబ్దాల క్రితం ఓ వెలుగు వెలిగిన ఫాంటసీ ప్రపంచం మాత్రం కనుమరుగైంది.

## ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి
## సెప్టెంబరు 12, 13న ప్రత్యేక ప్రచార దినాలు



జడ్చర్ల సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR)పై జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ), 75–జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ERO జె.ఎల్.బి. హరిప్రియ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తహసీల్దార్/ AERO, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డీటీ తదితరులు పాల్గొన్నారు. SIR సవరించిన షెడ్యూల్‌ను జు=ా రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అక్టోబరు 7 వరకు, వాటి పరిష్కార ప్రక్రియ నవంబరు 5 వరకు కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను నవంబరు 9న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. MPDOలకు అదనపు AEROsగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులను నిర్ణీత గడువులోగా సర్వ్ చేసి, కేసులను మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 12, 13న అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండో విడత ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్లు డ్రాఫ్ట్ జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6, పేరు తొలగింపు/అభ్యంతరాలకు ఫారం–7, వివరాల సవరణ, చిరునామా మార్పులకు ఫారం–8 ద్వారా దీూాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకునేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను ERO కోరారు.

## ఎమ్మెల్యే బండ్ల. కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో
## - కాకులవరం గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

రూ.11.85 కోట్లతో పాఠశాల ఏర్పాటు



జోగులాంబ గద్వాల : సెప్టెంబర్ 08: గద్వాల నియోజకవర్గంలోని కాకులవరం గ్రామానికి రూ.11.85 కోట్ల నిధులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైంది. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో పాఠశాల మంజూరు కావడంతో గ్రామ సర్పంచ్ బండారి జయరాముడు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపించి, పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు. సర్పంచ్ జయరాముడు మాట్లాడుతూ.. పేద, ధనిక తేడా లేకుండా విద్యార్థులకు ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేల చెరువు సుభాన్,కాకుల వరం టి.రామచంద్రుడు, కొట్టం రాంచంద్రుడు, శివ, వెంకట్ రాజా, దాస్, బి.ఆంజనేయులు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాళోజి ఆశయాలే నేటి తరానికి
## స్ఫూర్తి ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి

జడ్చర్ల సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధిజడ్చర్ల పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ గిరీష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సాహిత్య సేవలు, ప్రజా చైతన్యానికి చేసిన కృషిని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మన్న, రెవెన్యూ అధికారి సలాం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగేష్, వివిధ శాఖల అధికారులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



సమయం
గురువారం 10 సెప్టెంబర్ 2026




ప్రముఖ యూట్యూబర్ నా అన్వేషణ అన్వేష్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇతనికి ప్రపంచ యాత్రికుడు అనే పేరు కూడా ఉంది. ప్రపంచ దేశాలు తిరుగుతూ.. అక్కడ జీవన శైలి ఎలా ఉంది అని ఫిల్టర్ లేకుండా చెప్తూ ఉంటాడు. ఒకప్పుడు ఇతనిపి ఇండియాలో చాలామంది ఫ్యాన్స్ ఉండేవారు. ముఖ్యంగా బెట్టింగ్ యాప్ ల గురించి అతను మాట్లాడిన విధానం అద్భుతమని నెటిజన్స్ చెప్పుకొచ్చారు. కానీ, ఎప్పుడైతే అన్వేష్.. నటుడు శివాజీ అమ్మాయిల డ్రెస్సింగ్ స్టైల్ గురించి చేసిన కొన్ని వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించడం ఇండియన్స్ కి నచ్చలేదు. దీంతో అతనిపి ఇండియన్స్ దుమ్మెత్తిపోశారు. అంతేకాకుండా పోలీస్ కేసులు కూడా పెట్టారు. ఆ తరువాత కొద్దిగా సైలెంట్ అయిన అన్వేష్.. ఇప్పుడు మరోసారి అక్కినేని నాగార్జున హోస్ట్ చేస్తున్న బిగ్ బాస్ పై మండిపడ్డాడు. ఇటీవల అగ్ని పరీక్ష 2 కార్యక్రమానికి చెందిన కొందరు కంటెస్టెంట్స్ తమ ఓట్ల కోసం స్కూల్స్, కాలేజీలకు వెళ్లి ప్రచారం చేయడం వివాదాస్పదమైంది. చదువుకునే విద్యార్థుల వద్దకు వెళ్ళి ఇలాంటి రియాలిటీ షోల ప్రచారాలు చేయడం సరికాదని, విద్యాసంస్థల యాజమాన్యాలు దీనికి ఎలా అనుమతించాయని పలువురు విమర్శించారు. ఈ విషయంపై స్పందించిన అన్వేష్, ఈ అంశంపై నాగార్జున మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా తప్పుపట్టాడు. కంటెస్టెంట్లు తెలియక తప్పు చేసినప్పటికీ, ఒక సీనియర్ నటుడిగా, బాధ్యతాయుత స్థానంలో ఉన్న నాగార్జున ఆ ప్రచారాలను ఖండించాల్సిందని అభిప్రాయపడ్డాడు.' స్కూల్ లో కాకుండా సినిమా హాళ్ల దగ్గర, బయట, లేకపోతే ఇంకెక్కడైనా ప్రచారం చేసుకోవచ్చు కదా.. చదువుకొనే పిల్లలను చెడగొట్టడం.. అది కూడా ఇలాంటి షో కోసం.. ఇది పద్దది కాదని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా, నాగార్జున వయసు,కుటుంబ నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ అన్వేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. 'మీకు 70 ఏళ్లు వచ్చాయి, ఇద్దరు కొడుకులు ఉన్నారు, త్వరలోనే తాత కాబోతున్నారు, ఇలాంటి సమయంలో తప్పులను ఖండించకుండా మౌనంగా ఉండటం సరికాదు. బిగ్ బాస్ యాజమాన్యానికి అంటే సిగ్గులేదు.. మీకు కూడా సిగ్గు లేదా.. అమల గారు ఎన్ని మంచి పనులు చేస్తున్నారు. మీరెందుకు ఇలాంటి పనులు ఆపడం లేదు. మీరేమి బాలాకుమారులు కాదు.. 70 ఏళ్లు వచ్చాయి. ఇంకో 15 ఏళ్లు ఉంటే మీరు కూడా చనిపోతారు. అప్పుడు బిగ్ బాస్ హౌస్ లోకి పోరంబోకులు పంపిన హోస్ట్ అంటూ చెప్పుకుంటారు' అని ఘాటుగా మండిపడ్డారు. సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని హితవు పలికాడు. ఇక ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వ్యాఖ్యలపై నెటిజన్ల మధ్య తీవ్రమైన చర్చ నడుస్తోంది. కొందరు అన్వేష్ విమర్శలకు మద్దతు తెలపగా, మరికొందరు మాత్రం నాగార్జునపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తగదని ఆక్షేపిస్తున్నారు. ఈ వివాదంపై నాగార్జున లేదా బిగ్ బాస్ టీమ్ స్పందిస్తారో లేదో వేచి చూడాలి.




విజయ్ దేవరకొండ , నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రం రణబాలి. టాక్సీవాలా వంటి విజయవంతమైన చిత్రంతర్వాత విజయ్ దేవరకొండ- రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కావడం వల్ల ఈ కాంబినేషన్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను వచ్చే ఏడాది అక్టోబర్ 16న రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఇక ఈ చిత్రంలో హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లే విలన్ గా నటించాడు. ఇప్పటికే ఈ చిత్రం నూకణహి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా రణబాలి టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. 1876-1878 కాలంలో భారతదేశాన్ని కుదిపేసిన దారుణమైన కరువు, బ్రిటిష్ పాలన నేపథ్యంలో రణబాలి తెరకెక్కినట్లు టీజర్ ని చూస్తుంటే అర్ధమవుతోంది. ఇది అన్నపూర్ణ దేశంరా.. అన్నానికి కరువేంది అనే డైలాగ్.. ఆ విజువల్స్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. అన్నపూర్ణ లాంటి భూమిపై ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే, బ్రిటిష్ వారి అణచివేతకు, అన్యాయాలకు వ్యతిరేకంగా తన ప్రజలను కాపాడుకోవడానికి.. తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే ఒక తెగింపు ఉన్న యోధుడి ప్రయాణాన్ని టీజర్‌లో ఆవిష్కరించారు. సింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ నట విశ్వరూపం చూపించాడు. రణబాలి భార్యగా రష్మిక కూడా ప్రాధాన్యత ఉన్న పాత్రలో మెరిసింది.టీజర్ అంతా ఒక ఎత్తు అయితే.. అజయ్-అతుల్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్ పీరియాడిక్ వాతావరణాన్ని చాలా ప్రభావవంతంగా ఆవిష్కరించాయి. విజయ్ దేవరకొండ రఫ్ అండ్ మాస్ లుక్‌తో పాటు ఆయన చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్‌లు టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచి సినిమాపై అంచనాలను పెంచేశాయి. ముఖ్యంగా సింగనమల బొబ్బిలి రణబాలిరా నీయక్కా అనే డైలాగ్ టీజర్ కే హైలైట్ గా నిలిచింది. ఈసారి విజయ్ కచ్చితంగా హిట్ కొట్టేలా ఉన్నాడని నెటిజన్స్ చెప్పుకొస్తున్నారు. మరి విజయ్ కి రణబాలి ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.




టాలీవుడ్ యంగ్ అండ్ హ్యాండ్సమ్ హీరో నాగశౌర్య విభిన్నమైన సినిమాలతో నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విషయం తెల్సిందే. అయితే, గత కొంతకాలంగా నాగశౌర్య వెండితెరపై కానీ, ఇండస్ట్రీ వర్గాల్లో కానీ పెద్దగా కనిపించకపోవడంతో సోషల్ మీడియాలో రకరకాల వార్తలు షికారు చేశాయి. నాగశౌర్యకు ఏమైంది.. ? ఎందుకు సినిమాలు చేయడం లేదు.. ? అవకాశాలు లేవా.. ? ఇలా రకరకాల అనుమానాలు వ్యక్తమయ్యాయి. అంతే ఆకకుండా కొంతమంది నాగశౌర్యకు భార్య అనూష శెట్టితో ఆయనకు తీవ్ర మనస్పర్థలు వచ్చాయని, ఇద్దరూ విడివిడిగా దూరంగా ఉంటున్నారని, త్వరలోనే విడాకులు కూడా తీసుకుంటున్నారని ప్రచారం జరిగింది. అంతేకాకుండా, వ్యక్తిగత జీవితంలో నెలకొన్న ఈ విభేదాల వల్లే నాగశౌర్య సినిమాలకు దూరంగా ఉంటూ కొత్త ప్రాజెక్టులు ఒప్పుకోవడం లేదనే పుకార్లు కూడా పుట్టించారు. ఇక తాజాగా ఈ వార్తలకు నాగశౌర్య స్పందించకపోయినా.. ఆయన భార్య అనూష చెక్ పెట్టింది. డైరెక్ట్ గా చెప్పకపోయినా వారిద్దరూ కలిసి వెకేషన్ ను ఎంజాయ్ చేస్తోన్న ఫోటోలను షేర్ చేసి రూమర్లకు చెక్ పెట్టింది. ప్రస్తుతం ఈ జంట ఫ్రాన్స్‌లోని సుందరమైన ప్రదేశాలలో వెకేషన్‌ను ఎంజాయ్ చేస్తోంది.







ఎవరైనా అతి చేస్తే 'వాడికి అంత సీన్ లేదు' అని చెబుతుంటారు. కానీ కొందరికి మాత్రం అంత సీన్ ఉంటుంది. అదే సూర్య! గత కొన్నేళుళ్గా వరుస పరాజయాలతో సాగుతున్నా తమిళ స్టార్ హీరో సూర్య క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. భిన్నమైన కథాంశాలు, విలక్షణమైన పాత్రలూ చేస్తూనే ఉన్నాడు. అయితే ఈ యేడాది అతనిదే! మే 15న విడుదలైన సూర్య సినిమా 'కరుప్పు' ఘన విజయాన్ని సాధించింది. ఈ మూవీతో సూర్య మరోసారి సక్సెస్ ట్రాక్ ఎక్కాడు. ఈ సినిమా తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో రిలీజ్ అయ్యి... ఇక్కడా విజయకేతనం ఎగరేసింది. సినిమా చూసిన వాళ్ళు పెదవి విరిచినా... సాధారణ జనాలకు 'వీరభద్రుడు' తెగ నచ్చేసింది. 'కరుప్పు' విడుదలైన మూడు నెలలకే... ఈ సంవత్సరం సూర్య రెండో సినిమాగా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదలైంది. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా తమిళులను పెద్దంతగా ఆకట్టుకోలేదు కానీ తెలుగులో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ రకంగా సూర్యకు ఇదీ హిట్ చిత్రం కిందే లెక్క. ఇక తాజాగా ఇప్పుడు మూడో సినిమా రాబోతోంది. 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నాడు. 'ఆవేశం, రోమాంచమ్' దర్శకుడు జీతూ మాధవన్ దీనికి దర్శకత్వం వహిస్తున్నాడు. సూర్య సరసన నజ్రియా నజీమ్ నటిస్తోంది. ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అంతేకాదు దీపావళి కానుకగా ఈ చిత్రాన్ని నవంబర్ 6న విడుదల చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటిస్తూ ఓ వీడియోనూ విడుదల చేశారు. మలయాళ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ దీనికి స్వరాలు సమకూర్చుతున్నాడు. నవంబర్ 6న పాన్ ఇండియా స్థాయిలో రణబీర్ కపూర్, యశ్, సాయిపల్లవి నటిస్తున్న 'రామాయణ' రాబోతోంది. మరి ఆ సినిమా నుంచి ఎదురయ్యే పోటీని 'సీన్' ఏ మేరకు తట్టుకుంటుందో చూడాలి. ఒకవేళ ఇదీ మంచి విజయాన్ని అందుకుంటే సూర్య ఈ యేడాది హ్యాట్రిక్ సాధించినట్టే అవుతుంది.




ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మండాడి'. మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఎల్రెడ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు ఇతర కీలక పాత్రలను పోషించారు. సెప్టెంబర్ 10న భారీ ఎత్తున రిలీజ్ అయ్యేందుకు ఈ చిత్రం సిద్ధమైంది. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఇక ఇప్పటి వరకు విడుదలైన పాటలు, టీజర్ అన్నీ కూడా సినిమాపై హైప్‌ను పెంచేయగా.. రీసెంట్‌గా వచ్చిన ట్రైలర్ సినిమాను చూడాలనే ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేయడంలో సక్సెస్ అయింది. తాజాగా ఈ మూవీ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని.. విడుదలకు అన్ని రకాలుగా సిద్ధమైంది. సెన్సార్ సభ్యుల నుంచి యుబైఏ సర్టిఫికెట్‌ని ఈ చిత్రం సొంతం చేసుకుంది. మూవీ అద్భుతంగా వచ్చిందని, బోట్ సీక్వెన్స్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయని సెన్సార్ టీం అభినందించడంతో.. టీమ్ కూడా సినిమాపై చాలా నమ్మకంతో ఉంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085